శంకర్‌నాయక్ కుటుంబానికి పరామర్శ

రాయపర్తి, సెప్టెంబర్ 29: ఊకల్ పరిధి లోని బాలాజీతండాలో ఇటీవల మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ తండ్రి కేవ్లానాయక్ మృతిచెందాడు. ఆదివారం కేవ్లానాయక్ దశదినకర్మకు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మాజీ ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానికసంస్థల ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. కేవ్లానాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మహబూబాబాద్ మాజీ ఎంపీ, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు బిల్లా సుధీర్‌రెడ్డి, చింతం సదానందం, జినుగు అనిమిరెడ్డి, మోహన్‌గాంధీనాయక్, నయీం, రంగు కుమార్, చెవ్వ కాశీనాథం, పూస మధు, ఎం శ్రీనివాస్, కొమ్ము రాజు, బొడ్డు రంగయ్య పాల్గొన్నారు. అనంతరం మండలకేంద్రానికి చెందిన ఆవుల కేతమ్మ మృతి చెందగా, ఎర్రబెల్లి హాజరై ఆమె అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ శ్రేణులు చందు సతీశ్‌యాదవ్, రామ్‌యాదవ్, చిన్నాల ఉప్పలయ్య, మర్రి వెంకటేశం ఉన్నారు.

కేవ్లానాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీ మాలోత్ కవిత

వ్యాయామంతో గుండె పదిలం

- ఆహార నియమాలు పాటించాలి
- మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలి
- కేఎంసీ ప్రిన్సిపాల్ రామ్‌కుమార్‌రెడ్డి, ఎంజీఎంహెచ్ సూపరింటెండెంట్ మురళి
- ఘనంగా ప్రపంచ గుండె దినోత్సవం

కేక్ కట్ చేస్తున్న కేఎంసీ ప్రిన్సిపాల్, ఎంజీఎం సూపరింటెండెంట్, కార్డియాలజీ విభాగాధిపతి, వైద్యాధికారులు

వరంగల్‌చౌరస్తా, సెప్టెంబర్ 29: కాకతీయ మెడికల్ కళాశాల ఆవరణలోని సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఆదివారం ప్రపంచ గుండె దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ మమతారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో 'గుండె ఆరోగ్యం–కాపాడుకోవడం ఎలా' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కాకతీయ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్‌కుమార్‌రెడ్డి, ఎంజీఎం హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ చిలుక మురళి హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆధునిక యుగంలో మానవులు యాంత్రిక జీవితాలు గడుపుతూ అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యంగా గుండె సంబంధిత వ్యాధులతో బాధపడే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోందనని ఆందోళన వ్యక్తం చేశారు. శారీరక శ్రమ తగ్గిపోవడం, తీవ్ర మానసిక ఒత్తిడికి గురికావడంతోపాటు ఆహారపు అలవాట్ల వల్ల చాలామంది గుండె వ్యాధులతో బాధపడుతున్నారని వివరించారు. రోజుకు కనీసం 30 నిమిషాలపాటు నడక, సైక్లింగ్ లాంటి వ్యాయామాలు చేయాలని సూచించారు. దీంతో గుండె వ్యాధులను చాలా వరకు నివారించొచ్చన్నారు. మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడం కోసం యోగా, ధ్యానం లాంటివి అలవాటు చేసుకోవాలని కోరారు. పౌష్టికాహారం తీసుకోవాలని, కొవ్వు పదార్థాలు తక్కువగా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు రాంరెడ్డి, సృజన్, రితీశ్, ఆర్‌ఎంవో రోషన్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ మీదుగా సిటీ బస్సులు నడపాలి

ఆర్టీసీకి విజ్ఞప్తి చేస్తున్న ప్రయాణికులు

పోచమ్మమైదాన్, సెప్టెంబర్ 29: కాజీపేట నుంచి వరంగల్ స్టేషన్‌ను నడుపున్న సిటీ బస్సుల్లో కొన్నింటిని కాశీబుగ్గ సెంటర్ మీదుగా నడపాలని స్థానికులు కోరుతున్నారు. కాజీపేట, వరంగల్ వైపు ప్రయాణిస్తున్న సిటీ బస్సులన్నీ పోచమ్మమైదాన్, వరంగల్‌చౌరస్తా మీదుగా వెళ్లడం వల్ల వరంగల్ హాస్పిటల్, కాశీబుగ్గ, కూరగాయల మార్కెట్, వెంకట్రామ, లేబర్ కాలనీకి వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని వాపోతున్నారు. ముఖ్యంగా ఈ మార్గంలో పలు ప్రైవేట్ హాస్పిటల్స్, పాఠశాలలు, కళాశాలలతోపాటు డీ–మార్ట్ ఉండడం వల్ల ప్రయాణికుల రద్దీగా ఎక్కువగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. కొన్ని బస్సులను ఈ మార్గం గుండా నడిపించడం వల్ల ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందని విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే, పోచమ్మమైదాన్ నుంచి వరంగల్ హాస్పిటల్, డీ–మార్ట్, కాశీబుగ్గ చౌరస్తా, వెంకట్రామ జంక్షన్, కూరగాయల మార్కెట్ వద్ద బస్ స్టాప్‌లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు గుర్రం రఘు

'నిందితులను కఠినంగా శిక్షించాలి'

గీసుగొండ, సెప్టెంబర్ 29: ఆదివాసీ అటవీ అధికారులపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆదివాసీ తోటి తెగ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గర్రం రఘు డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో అటవీ అధికారులైన వినోద్, శరత్‌చంద్రపై దాడి చేసిన సూరజ్‌రెడ్డితోపాటు మరో ఇద్దరిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గిరిజనులపై దాడులు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. ప్రభుత్వం అటవీ అధికారులతోపాటు ఆదివాసీలకు రక్షణ కల్పించాలన్నారు. సమావేశంలో ఆదివాసీ సంఘం నాయకులు సోమ సాంబయ్య, రాజేందర్, నాగరాజు, రవీందర్, జగదీశ్వర్, రాజబాబు, శరత్‌బాబు, వెంకటస్వామి, ఆకుల యాదగిరి, ప్రశాంత్, కార్తీక్, సదానందం, కుమారస్వామి, రామకృష్ణ, వివేకానంద పాల్గొన్నారు.

'డే కేర్ సెంటర్' ఏర్పాటు చేయాలి

ర్యాలీ నిర్వహిస్తున్న వృద్ధులు

చెన్నారావుపేట, సెప్టెంబర్ 29: మండలంలోని వృద్ధుల కోసం డే కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని వయోవృద్ధుల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు ఈగ సత్యనారాయణ కోరారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా ఆదివారం మండలకేంద్రంలో వృద్ధులు ర్యాలీ నిర్వహించారు. వృద్ధుల జీవితానికి ప్రభుత్వం భరోసా కల్పించాలన్నారు. కవి ములుక సాంబయ్య, వరంగంటి మల్లయ్య, పత్తి అనంతరెడ్డి, తోట ఆనందం, కట్టయ్య, దొణికెల వీరస్వామి, మర్రి సాంబయ్య, పత్తి సంజీవరెడ్డి పాల్గొన్నారు.

గోవర్ధన్‌కు 'టఫ్' నాయకుల పరామర్శ

గోవర్ధన్‌ను పరామర్శిస్తున్న నాయకులు

నల్లబెల్లి, సెప్టెంబర్ 29: రోడ్డు ప్రమాదంలో గాయపడిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు కందుల గోవర్ధన్‌ను టఫ్ యూనియన్ మండల నాయకులు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా గోవర్ధన్ త్వరగా కోలుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు తంగెళ్ల భాస్కర్ ఆకాంక్షించారు. ఆయన వెంట ఉద్యమకారులు ఆకుల సాంబారావు, బొట్ల పవన్, నందగిరి రజినీకాంత్ ఉన్నారు.

క్రషర్ పేలుళ్లను ఆపాలి

సంగెం, సెప్టెంబర్ 29: క్రషర్ పేలుళ్ల వల్ల పంట చేలకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నామని, నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని గాంధీనగర్ గ్రామస్తులు కోరారు. ఈ మేరకు ఆదివారం వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 15 ఏళ్లుగా క్రషర్ నడుపుతున్నారని, డస్ట్, బ్లాస్టింగ్‌ల ద్వారా ఇండ్లు, పంట చేలు, బోరు బావులు పాడైపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బ్లాసింగ్‌ల నుంచి వచ్చే పొగ వల్ల అనారోగ్యం బారిన పడుతున్నామని, పంట చేలపై డస్ట్ పడి దిగుబడి రాక నష్టపోతున్నామని వాపోయారు. ఎన్నిసార్లు చెప్పినా యాజమాన్యం పట్టించుకోవడం లేదని, క్రషన్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో గ్రామస్తులు ఆళ్ల మధు, వాసం రాజు, నగేశ్, నల్లగుంట రవి, అనుమాస రాంబాబు, సాంబరాజు, శ్రీనివాస్, సుదన్ ఉన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి పరామర్శ

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎస్సై ప్రవీణ్

పర్వతగిరి, సెప్టెంబర్ 29: కానిస్టేబుల్ కుటుంబాన్ని ఎస్సై బి.ప్రవీణ్ పరామర్శించారు. చింతనెక్కొండకు చెందిన కానిస్టేబుల్ దబ్బేట విజేందర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆదివారం బాధిత కుటుంబాన్ని ఎస్సై సిబ్బందితో కలిసి పరామర్శించి ధైర్యం చెప్పారు. విజేందర్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

'కోట'లో బతుకమ్మ కమిటీ ఎన్నిక


నూతన ఉత్సవ కమిటీ సభ్యులు

ఖిలావరంగల్, సెప్టెంబర్ 29: తూర్పుకోట పోచమ్మగుడి వద్ద బతుకమ్మ, దసరా ఉత్సవ కమిటీని రాజకీయ పార్టీలకతీతంగా ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ, సభ్యులుగా బోయిన దూడయ్య, కందిమల్ల మహేశ్, సంగరబోయిన విజయ్, గన్నారపు రమేశ్, చుంచు జగదీష్, ఎల్లయ్య, వీరస్వామి, బెడద వీరన్న, సంగరబోయిన చందర్, ఉమేశ్, వాసుదేవ్, రాంబాబు, రాజ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, ధర్మరాజు, మేకల కుమార్, బంగారి శ్రీను, అల్లం కేశవరాజు, పెసరు కుమార్, సంగని శివ, ఐలయ్య, సారంగపాణి, కిరణ్, దేవేందర్, రవీందర్ ఎన్నికయ్యారు.

పది కాలాలపాటు నిలిచి ఉండేది కవిత్వం

- సహృదయ సాహితీ సంస్థ అధ్యక్షుడు మనోహర్‌బాబు
- 'గాయమెరుగని సముద్రం' పుస్తకావిష్కరణ

పోచమ్మమైదాన్, సెప్టెంబర్ 29: పది కాలాలపాటు నిలిచి ఉండేదే కవిత్వమని, ఇది సమాజ శ్రేయస్సును కాంక్షించే విధంగా ఉండాలని సహృదయ సాహితీ సంస్థ అధ్యక్షుడు గన్నమరాజు గిరిజ మనోహర్‌బాబు అన్నారు. హనుమకొండలోని పీఆర్‌రెడ్డి భవన్‌లో దేవగిరిపట్నం పరివార్, డీఎన్‌ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గన్నోజు ప్రసాద్ రచించిన 'గాయమెరుగని సముద్రం' అనే పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. తాడిచెర్ల రవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సమాజ శ్రేయస్సుకు ఉపయోపడే పద్ధతిలో ప్రసాద్ కవిత రూపంలో చెప్పారని కొనియాడారు. ఈ పుస్తకం ఆలోచన రేకెత్తించే విధంగా ఉందని, సాహిత్య లోకంలో గొప్ప మార్పు వస్తుందన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు దొడ్డ ప్రతాప్‌రెడ్డి, చక్రవర్తుల శ్రీనివాస్, మేరుగు అనురాధ, బిల్లా మహేందర్, మడత భాస్కర్, పుస్తక సమీక్షకులుగా తండా హరీశ్ గౌడ్, కవులు, సాహితీవేత్తలు, ఉపాధ్యాయులు, మేధావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గన్నోజు ప్రసాద్ రాసిన పుస్తకాన్ని ఆయన తల్లిదండ్రులు గన్నోజు వీరమ్మ–రాజశేఖరంకు అంకితం చేశారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

లోన్ యాప్ నిర్వాహకుల వేధింపులతో యువకుడి ఆత్మహత్య

అనిల్(ఫైల్)

భీమదేవరపల్లి, సెప్టెంబర్ 29 : ఆన్‌లైన్‌లో తీసుకున్న అప్పులను తీర్చలేక ఓ యువకుడు పురుగులమందు తాగి వరంగల్ ఎంజీఎం దవాఖానలో చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. ముల్కనూరుకు చెందిన మాడుగుల అనిల్(29) డిగ్రీ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. ఉపాధి కోసం వివిధ రకాల యాప్‌లు, బ్యాంకుల ద్వారా రూ.9లక్షల వరకు అప్పులు తీసుకున్నాడు. ఈ డబ్బులతో టాటా ఏస్ వాహనం కొని మొబైల్ టిఫిన్ సెంటర్‌ను భీమారంలో ప్రారంభించాడు. టిఫిన్ సెంటర్ ఆశించినంత నడవకపోవడంతో వ్యాపారం మానేసి ఇంటివద్దే ఉంటున్నాడు. రెండు నెలల క్రితం ముల్కనూరులో ఫాస్ట్‌పుడ్ సెంటర్ పెట్టాడు. ఇక్కడ కూడా షాప్ నడవకపోవడంతో కుంగిపోయాడు. అప్పులు చెల్లించాలని ఫోన్ యాప్ నిర్వాహకులు తీవ్ర ఒత్తిడి చేయగా తీవ్ర మనస్తాపంతో ఈనెల 28న పురుగులమందు తాగాడు. కుటుంబ సభ్యులు ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందాడు. తల్లి వినోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ముల్కనూరు ఎస్సై సాయిబాబు తెలిపారు.

ఒకరిపై కేసు నమోదు

పర్వతగిరి, సెప్టెంబర్ 29: మండలకేంద్రంలో ఆదివారం రాత్రి ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఎడ్ల నాగరాజుపై దురుసుగా ప్రవర్తించిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. పర్వతగిరి చౌరస్తాలో ఆదివారం బస్సు ఆపగా, ప్రయాణికులు దిగుతున్నారు. వెనకాలే కారులో వచ్చిన కల్లెడకు చెందిన భాస్కర్ల రాజు డ్రైవర్‌పై దుర్భాషలాడాడు. రోడ్డుపై ఎంత సేపు బస్సు ఆపుతావని డ్రైవర్‌ను దూషించాడు. అంతటితో ఆగకుండా ఆర్టీసీ బస్సు తాళం చెవిలను లాక్కొని వెళ్లాడు. డ్రైవర్ నాగరాజు ఫిర్యాదు మేరకు రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

మీ రిటైర్మెంట్ అనంతరం ఆనందకర జీవితాన్ని సొంతం చేసుకోవడానికున్న చక్కని ఆర్థిక సాధనాల్లో నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) ఒకటి. అయితే ఇందులో తగిన యాన్యుటీ ప్లాన్‌ను ఎంచుకొనే బాధ్యత మాత్రం పెన్షనర్‌దే. ఎన్‌పీఎస్ 2024 హ్యాండ్‌బుక్ వివరాల ప్రకారం 2004 జనవరి 1న ఈ స్కీం ప్రారంభమైన దగ్గర్నుంచి పదవీ విరమణ సమయంలోనే 1,65,320 మంది యాన్యుటీ ప్లాన్లను ఎంచుకున్నట్టు తేలింది.

ఎన్‌పీఎస్‌లో సరైన ప్లాన్?

ప్రస్తుతం ఎన్‌పీఎస్ సబ్‌స్క్రైబర్ల కోసం 15 రకాల యాన్యుటీ ప్లాన్లు అందుబాటులో ఉన్నాయి. అలాగే ఎల్‌ఐసీ, ఎస్బీఐ లైఫ్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్, కొటక్ మహీంద్రా లైఫ్, మ్యాక్స్ లైఫ్, బజాజ్ అలియాంజ్ లైఫ్ ఇన్సూరెన్స్, శ్రీరామ్ లైఫ్, టాటా ఏఐఏ లైఫ్, ఆదిత్యా బిర్లా సన్ లైఫ్ తదితర 15 జీవిత బీమా సంస్థలు యాన్యుటీ సర్వీస్ ప్రొవైడర్లుగా పనిచేస్తున్నాయి. యాన్యుటీ రేట్లు, ఆప్షన్సనుబట్టి ఈ ప్లాన్లు మారుతూ ఉంటాయి. ప్రస్తుతమున్న యాన్యుటీ ప్లాన్లలో ఐదు రకాలే పాపులర్. వాటిలో యాన్యుటీ ఫర్ లైఫ్ విత్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్, జాయింట్ లైఫ్ యాన్యుటీ విత్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్, ఎన్‌పీఎస్–ఫ్యామిలీ ఇన్‌కమ్ ఆప్షన్ విత్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్, యాన్యుటీ ఫర్ లైఫ్ వితౌట్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్, జాయింట్ లైఫ్ యాన్యుటీ వితౌట్ రిటర్న్ పర్చేజ్ ప్రైస్.



ఎంచుకోండిలా..

యాన్యుటీ ఫర్ లైఫ్ విత్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్‌లో సబ్‌స్క్రైబర్‌కు జీవితాంతం యాన్యుటీ వస్తుంది. ఒకవేళ చనిపోతే ఇది ఆగుతుంది. నామినీకి ప్లాన్ కొన్న ధరలో 100 శాతం తిరిగొస్తుంది.

జాయింట్ లైఫ్ యాన్యుటీ విత్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్‌లో సబ్‌స్క్రైబర్‌కు జీవితాంతం యాన్యుటీ వస్తుంది. ఒకవేళ చనిపోతే వారి భాగస్వామికి వస్తుంది. వీరూ చనిపోతే నామినీకి ప్లాన్ కొన్న ధర మొత్తం తిరిగొస్తుంది.

ఎన్‌పీఎస్–ఫ్యామిలీ ఇన్‌కమ్ ఆప్షన్ విత్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్‌లో సబ్‌స్క్రైబర్‌కు, వారు చనిపోతే వారి భాగస్వామికి, వీరూ చనిపోతే సబ్‌స్క్రైబర్ మీద ఆధారపడ్డ తల్లిదండ్రులకు యాన్యుటీ చెల్లింపులు జరుగుతాయి. వీరి తదనంతరం సబ్‌స్క్రైబర్ పిల్లలు లేదా లీగల్ వారసులకు ప్లాన్ కొన్న ధరను మొత్తంగా చెల్లించడం జరుగుతుంది.

యాన్యుటీ ఫర్ లైఫ్ వితౌట్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్‌లో సబ్‌స్క్రైబర్ జీవించి ఉన్నంత వరకే యాన్యుటీ వస్తుంది. చనిపోతే భాగస్వామికి, నామినీలకూ రాదు.

జాయింట్ లైఫ్ యాన్యుటీ వితౌట్ రిటర్న్ పర్చేజ్ ప్రైస్‌లో సబ్‌స్క్రైబర్, వారి భాగస్వామి జీవించి ఉన్నంతదాకా యాన్యుటీ వస్తుంది. వీరు చనిపోతే నామినీలకు ఏమీ రాదు. వీటన్నింటిలో మనకు ఏది ఉత్తమం అనుకుంటే దాన్ని ఎంచుకోవడం లాభదాయకం.

✔ ఇవి గుర్తుంచుకోండి.. ✔

యాన్యుటీని కొనేముందు మన భవిష్యత్తు ఆర్థిక అవసరాలు ఏమిటన్నదానిపై అవగాహన ఉండాలి.

అందుబాటులో ఉన్న యాన్యుటీ, పేఔట్ ఆప్షన్లు, నిబంధనలు, యాన్యుటీ కాంట్రాక్ట్ షరతులనూ తెలుసుకోవాలి.

వయసు, కొనే ధరనుబట్టి యాన్యుటీ రేట్లు ఆధారపడి ఉంటాయి.

నెల, త్రైమాసిక, అర్ధ వార్షిక, వార్షికవారీ చెల్లింపులను ఎంచుకోవచ్చు.

పెన్షనర్ మరణానంతరం భాగస్వామికి కూడా పెన్షన్ వచ్చే ప్లాన్‌ను ఎంచుకుంటే పెన్షన్ తక్కువగా వస్తుంది.

కొన్న ధరను తిరిగి చెల్లించనక్కర్లేని ప్లాన్‌ను ఎంచుకుంటే పెన్షన్ ఎక్కువగా వస్తుంది.

ఒక్కసారి యాన్యుటీ ఆప్షన్‌ను ఎంచుకొంటే ఇక మారదు. కాబట్టి ఎంచుకొనేటప్పుడే అన్నీ చూసుకొని నిర్ణయం తీసుకోవాలి.

చిన్న పెట్టుబడి.. పెద్ద రాబడి

మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్‌లో ఇన్వెస్ట్ చేస్తారా?

త్వరపడండి.. మరో 6 నెలలే సమయం

మీరు ఒక మహిళ అయితే, నమ్మకమైన రిటర్నులతో సురక్షిత పెట్టుబడిని కోరుకుంటున్నట్టైతే.. మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎంఎస్ఎస్‌సీ)ను తీసుకోవచ్చు. కనీస పెట్టుబడి రూ.1,000 నుంచి మొదలవుతుంది. వడ్డీరేటు కూడా 7.5 శాతంగా ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్న చాలా ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీలు) లేదా పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్స్ (పీపీఎఫ్)లపై పొందే వడ్డీలకన్నా ఇది ఎక్కువే. అంతేగాక తమ ఆడబిడ్డల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు లేదా సంరక్షకులకున్న అత్యుత్తమ పెట్టుబడి సాధనంగానూ దీన్ని పేర్కొనవచ్చు. దీనికి రెండేండ్ల లాకిన్ పీరియడ్ ఉంటుంది. దీంతో చదువు కోసం పొదుపు, చిరు వ్యాపారాల కోసం ప్రణాళికల వంటి స్వల్పకాలిక ఆర్థిక లక్ష్యాల సాధనకూ చక్కగా ఉపయోగపడుతుందనే చెప్పాలి.

ఏమిటి ఈ పథకం?

మహిళా సాధికారతే లక్ష్యంగా ఈ పథకాన్ని రూపొందించారు. మహిళలు, ఆడపిల్లల అవసరాలకు పొదుపును ప్రోత్సహించడంలో భాగంగా 2023 ఏప్రిల్‌లో కేంద్ర ప్రభుత్వం ఈ స్కీంను ప్రారంభించింది. ఇందులో సురక్షిత, అధిక రాబడిగల పెట్టుబడులకు అవకాశాలుంటాయి. అయితే ఈ స్కీం పరిమిత కాలమే అందుబాటులో ఉంటుంది. వచ్చే ఏడాది మార్చిదాకే లభిస్తుంది.

ప్రధాన ఫీచర్లు..

వార్షిక వడ్డీరేటు: 7.5 శాతం. ప్రతీ మూడు నెలలకోసారి లెక్కించి జమ చేస్తారు.

అర్హత: మహిళలు, ఆడపిల్లలకు మాత్రమే ఈ స్కీంలో పెట్టుబడికి వీలుంటుంది. మైనర్ల కోసం తల్లిదండ్రులు, వారి సంరక్షకులూ ఈ పథకాన్ని తీసుకోవచ్చు.

కాలపరిమితి: రెండేండ్లు. స్వల్పకాలిక లక్ష్యాలకు ఇది చక్కని సాధనం.

పెట్టుబడి: కనిష్ఠం రూ.1,000. గరిష్ఠం రూ.2 లక్షలు. ఒకేసారి డిపాజిట్ చేయాల్సి ఉంటుంది.

ఏమిటి దీని ప్రత్యేకత?

- ఈ పథకంలో పెట్టుబడులపై ఏటా గరిష్ఠంగా 7.5 శాతం వడ్డీరేటును పొందవచ్చు. సేవింగ్స్ అకౌంట్స్, ఎఫ్‌డీలు, పీపీఎఫ్‌లతో పొందే వడ్డీరేటు కంటే ఇది ఎక్కువ. పీపీఎఫ్‌లో కూడా 7.1 శాతం వడ్డీరేటే వస్తున్నది. మహిళా సాధికారత దృష్ట్యానే ఈ స్కీంకు అన్నింటి కంటే ఎక్కువ వడ్డీరేటును ఆఫర్ చేస్తున్నారు.
- పెట్టుబడి మొదలైన ఏడాది తర్వాత అందులో 40 శాతం వరకు తిరిగి వెనక్కి తీసుకునే వెసులుబాటు ఈ పథకంలో ఉన్నది. అత్యవసర సమయాల్లో ఈ సొమ్మును వాడుకోవచ్చు. అలాగే ఇది కేంద్ర ప్రభుత్వ పథకం. కాబట్టి అత్యంత సురక్షితమైన పెట్టుబడిగా దీన్ని పేర్కొనవచ్చు. నిర్భయంగా మహిళలు తమ కష్టార్జితాన్ని ఇందులో మదుపు చేయవచ్చు.

ఎలా పెట్టుబడి పెట్టాలి?

పోస్టాఫీస్ లేదా ప్రభుత్వ రంగ బ్యాంకులో ఖాతా ద్వారా మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్‌లో పెట్టుబడులకు దిగవచ్చు. పోస్టాఫీసుల్లోనైతే దగ్గర్లోని పోస్టాఫీస్‌కు వెళ్లి అక్కడ దరఖాస్తు ఫారంను నింపాలి. మీ వ్యక్తిగత వివరాలు, పెట్టుబడి మొత్తంతోపాటు ఆధార్, పాన్, చిరునామా తదితర అవసరమైన ఇతర కేవైసీ డాక్యుమెంట్లను సమర్పించాలి. పెట్టుబడి మొత్తాన్ని నగదుగానైనా చెక్కు రూపంలోనైనా ఇవ్వవచ్చు. దీంతో ఎంఎస్ఎస్‌సీని అందుకోవచ్చు.

బ్యాంకుల్లోనైతే మీకు దగ్గర్లోని ప్రభుత్వ బ్యాంకుల శాఖలకు వెళ్లి అప్లికేషన్ ఫారాన్ని నింపి, కేవైసీ డాక్యుమెంట్ల జిరాక్స్‌లను సమర్పించాలి. నగదు, చెక్కు, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ ద్వారా పెట్టుబడులు పెట్టవచ్చు. ప్రాసెసింగ్ అనంతరం సర్టిఫికెట్ మీ చేతికి వస్తుంది. కాగా, పెట్టుబడి పెట్టిన 6 నెలల తర్వాత మీ ఖాతాను మీరు ముగించవచ్చు. కానీ వడ్డీరేటు 5.5 శాతమే వర్తిస్తుంది. రూ.2 లక్షలు పెట్టుబడిగా పెడితే రెండేండ్ల తర్వాత రూ.2,32,044 వస్తుంది.

డిపాజిట్	వడ్డీ ఆదాయం	చివరకు వచ్చే మొత్తం
₹ 1,000	₹ 160	₹ 1,160
₹ 2,000	₹ 320	₹ 2,320
₹ 3,000	₹ 481	₹ 3,481
₹ 5,000	₹ 801	₹ 5,801
₹ 10,000	₹ 1,602	₹ 11,602
₹ 20,000	₹ 3,204	₹ 23,204
₹ 30,000	₹ 4,807	₹ 34,807
₹ 50,000	₹ 8,011	₹ 58,011
₹ 1,00,000	₹ 16,022	₹ 1,16,022
₹ 1,50,000	₹ 24,033	₹ 1,74,033
₹ 2,00,000	₹ 32,044	₹ 2,32,044

చదువు కోసం మదుపు..

నేడు పిల్లల విద్య కోసం చేస్తున్న ఖర్చుల భారం అంతా ఇంతా కాదు. తల్లిదండ్రులకు ఇదో పెద్ద సమస్యలా తయారైంది. అయితే సరైన ప్రణాళికతో పెట్టుబడులు పెడుతూపోతే దీన్ని అధిగమించవచ్చు. దీనికున్న అవకాశాలను పరిశీలిస్తే..

ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్లు

పిల్లల ఉన్నత విద్య వంటి దీర్ఘకాల లక్ష్యాల సాధనకు ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్ చక్కని మార్గం. సిప్ ద్వారా మ్యూచువల్ ఫండ్స్‌ల్లో పెట్టే పెట్టుబడులు ఈక్విటీల్లోకి వెళ్తాయి. చిన్న మదుపరులకూ ఇవి ఉపయుక్తంగా ఉంటాయి. అయితే ఈ పెట్టుబడులు మార్కెట్ ఒడిదొడుకులకు లోబడి ఉంటాయన్నది గుర్తుంచుకోవాలి.

ఎడ్యుకేషనల్ స్కీములు

వివిధ మ్యూచువల్ ఫండ్స్.. పిల్లల విద్యకయ్యే ఖర్చుల కోసం రకరకాల పథకాలను అమలు చేస్తున్నాయి. ఈ క్రమంలోనే ఈక్విటీ, డెట్ లేదా బంగారంపై పెట్టుబడులు పెడుతూ ఆకర్షణీయ రాబడులను పొందవచ్చు.

ఫిక్స్‌డ్ డిపాజిట్లు

ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్లతో పోల్చితే ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీ) తక్కువ రాబడులనే అందిస్తాయి. కానీ ఇవి సురక్షితమైనవి, నిర్దేశిత రాబడులనూ అందుకోవచ్చు.

విద్యా రుణాలు

ఉన్నత విద్య కోసం తల్లిదండ్రులు విద్యా రుణాలనూ తీసుకోవచ్చు. ఇతర రుణాలతో పోల్చితే వీటికి కొన్ని వెసులుబాట్లుంటాయి. మారటోరియం పీరియడ్ ఉంటుంది. విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత రుణ చెల్లింపులను ప్రారంభించుకోవచ్చు. పాత పన్ను విధానం కింద ఐటీ చట్టంలోని సెక్షన్ 80ఈతో పన్ను మినహాయింపూ లభిస్తుంది.

ఆటుపోట్లకు ఆస్కారం!

దేశీయ స్టాక్ మార్కెట్లలో రికార్డ్ రన్ కొనసాగుతున్నది. మునుపెన్నడూలేని గరిష్ఠాల్లో సూచీలు కదలాడుతున్నాయి. ఇన్వెస్టర్లు పెట్టుబడుల దిశగానే పోతున్నారు. గత వారం ట్రేడింగ్‌లో ఎక్కువ రోజులు ఈక్విటీ మార్కెట్లు లాభాల్లోనే నడిచాయి. ఈ క్రమంలోనే వారం మొత్తంగా సూచీలు భారీగానే ఎగిశాయి. అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,027.54 పాయింట్లు లేదా 1.21 శాతం పెరిగి 85,571.85 వద్ద స్థిరపడింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 388 పాయింట్లు లేదా 1.50 శాతం పుంజుకొని 26,178.95 దగ్గర ముగిసింది. ఈ నేపథ్యంలో లాభాల స్వీకరణకు అవకాశాలు కనిపిస్తున్నాయి. శుక్రవారం మార్కెట్లు నష్టపోవడం ఇందుకు సంకేతంగా తీసుకోవచ్చని మెజారిటీ నిపుణులు సూచిస్తున్నారు. ఆల్‌టైమ్ హై దరిదాపుల్లో ఉండటం వల్ల సెల్లింగ్ ప్రెషర్ ఎక్కువగా ఉంటుందన్న విషయాన్ని వారు గుర్తుచేస్తున్నారు. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 25,800 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 25,600 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 26,400–26,600 మధ్యకు వెళ్లవచ్చు.

చివరగా..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.